సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 8-9-2022

## నానీలు

అలరించావా
ఆమె పూలగుత్తి
వేధించావా
అవుతుంది మెత్తని కత్తి.

జీవితం రైలుకి
స్టేషన్ల బంధాలు
ఫ్లాటు ఫారాలపై
మమతల అందాలు

ఎంత చదివితే
అంతటి లోకం
గ్రంథం కాదది
జీవన కవాటం.

రంగూ, రంగస్థలం లేని
నిత్య ఏక్టర్స్
పార్టీ పదవుల్లో
ఆల్ రౌండర్స్



-డా॥ శిరీష
సెల్:98660 50220

## ఘంటారావం

వయసున్నవారికి
అనుభవముండదు
అనుభవమున్నవారికి
వయసుండదు.

మార్పులేని వాటి కోసం
మూర్ఛ తెచ్చుకోకు
మార్చగల విషయాలను
ఏమార్చాలని చూడకు.

అహానికి దాసోహమన్న జ్ఞానం
అజ్ఞానమే
అనుబంధాలకు అధీనమైన ధర్మం
అధర్మమే.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964



# అక్షర కర్షకుడు కాళోజీ...

**అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా ! చావవెందుకురా!?**

అన్ని భాషలు నేర్చుకో. కానీ నీ మాతృభాషను మాత్రం తప్పకుండా నేర్చుకోవాలని చెప్పిన మహానుభావుడు మన కాళోజీ. ఏది కావాలన్నా తొలుత మనిషి కావాలి. కాళోజీ మనసున్న మనిషి. కాళోజీ స్పందనకు కాళోజీయే సాటి. మార్క్సిస్ట పరిభాషలో చెప్పాలంటే ఆయన ఆదర్శవాది (Idealist) లేదా మానవతావాది (Humanist). నిరంతర సృజనశీలి. ఆయనొక సామాజిక తత్వవేత్తగా, ఆలోచకునిగా, దార్శనికునిగా ఎల్లకాలాలలో ప్రజాకవిగా కానవచ్చే నిష్ఠాగరిష్ఠుడు.

కాళోజీ రంగారావు, రమాబాయమ్మల రెండవ కుమారుడు. కాళోజీ నారాయణరావు పూర్తి పేరు "రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాస రామరాజ్". కర్ణాటక రాష్ట్రంలోని "రట్టహళ్లి " గ్రామంలో 9 సెప్టెంబర్1914న జన్మించారు. " కాళన్న " గా తెలుగు ప్రజలకు సుపరిచితులు.

కాళోజీ రాజకీయ, సాంఘిక చైతన్యాల సమాహారం. హక్కులనడిగిన ప్రజలమనిషి. విద్యార్థి జీవితం నుంచే విప్లవ స్పృహ కలిగిన ఉద్యమజీవి. తెలంగాణ జీవిత చలనశీలి. నిజాం నిరంకుశ పాలనపై కలం ఎక్కుపెట్టిన ప్రజాకవి. స్వాతంత్ర్య సమరయోధుడు. పుట్టుక చావులు కాకుండా బతుకంతా తెలంగాణ కిచ్చిన మహనీయుడు. జీవితమంతా పోరాటాల్లో మమేకమైన కాళోజీ నారాయణ రావు "కాళన్న " గా పరిణామం చెందడం ఒక చారిత్రక ఘట్టం. కాళోజీ నారాయణరావు గారి సేవలను గుర్తించి కాకతీయ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా... 1992 లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం " పద్మ భూషణ్" పొందిన మహనీయుడు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు కాళోజీ నారాయణరావు 100 వ జయంతి సందర్భంగా... కాళోజీ పుట్టినరోజైన సెప్టెంబర్ 9 ని తెలంగాణ భాషా దినోత్సవం గా జరుపుతోంది. మరియు 2015 నుండి కాళోజీ పురస్కారాన్ని ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వం ఏటా ప్రముఖ సాహితీవేత్తకు అవార్డును ప్రదానం చేస్తోంది.

కాళోజీ తెలుగు, ఉర్దూ హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో అనేక రచనలు చేసి ఖ్యాతి గడించారు. తెలంగాణ భాష, యాసను తరతరాలకు తెలిసే విధంగా రచనలు చేశారు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో దిట్ట. తన కవితల ద్వారా పేదలు, తెలంగాణ ప్రజల ఆవేదన, ఆగ్రహాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఆయన రాసిన 'నా గొడవ' సంకలనంలో సమకాలీన సామాజిక సమస్యలను నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయు ధాలను సంధించి ప్రజకవిగా నిలిచాడు. కవిత్వాలతో, గేయాలతో ప్రజలను నిద్రలేపిన కాళోజీ మరింత తీవ్రంగా అంకితభావంతో అక్షరం సంధించిన చైతన్యశీలి. మనిషితనం పట్ల ప్రేమ కలిగిన కాళోజీకి తెలంగాణ యాసపై విపరీతమైన అభిమానం. ఆయన ధిక్కార కవిత్వమంతా తెలంగాణ మాండలికం లో సాగింది.

At least there should not be an international style in poetry " అన్నాడు W.H. Auden.. తెలుగులో వచన కవిత్వాన్ని తమ నిర్దిష్టమైన మాండలిక భాష ద్వారా, మౌఖిక సంప్రదాయాన్ని ఏదో ఒక స్థాయిలో కవిత్వంలో ప్రవేశ పెట్టడం ద్వారా కాళోజీ లాంటి వాళ్ళు తెలుగు కవిత్వాన్ని Auden చెప్పిన international style నుండి కాపాడారు.



కాళోజీ తన భాషాసోయిని తెలుగు ప్రాంతాలన్నింటికి కూడా వ్యాపింపజేసిన వ్యవహారదక్షుడు. "బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష గావాలె "నని వ్యావహారిక భాషను అందలమెక్కించిన భాషావాదియైన అక్షర కర్షకుడు కాళోజీ. తెలంగాణ భాషను ఈసడింపుగా చూస్తే వారెవరైనా ఆయనకు భాషాకోపం నశాళానికంటుకునేది. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావులాంటి వారెందరికో సాహిత్యంలో, రాజకీయాల్లో మార్గనిర్దేశం చేసిన మహా మనీషి.

శతాబ్దపు జీవన ప్రయాణంలో ప్రతి మిమిషం పోరాటాన్ని శ్వాసించి, కవిత్వించిన వ్యక్తి.

**నేను ప్రస్తుతాన్ని.**
**నిన్నటి స్వప్నాన్ని,**
**రేపటి జ్ఞాపకాన్ని,** అని చెప్తూ...ఒక్కమాటలో తన వస్తు తత్వాన్ని చెప్తాడు.

"నవ యుగంబున నాజీ నగ్న నృత్య మింకెన్నాళ్ళు...హింస పాపమని ఎంచు దేశమున హిట్లరిత్వమింకెన్నాళ్లు..." అంటూ తన ధిక్కార స్వరాన్ని వినిపించిన యోధుడు.

" అన్నపురాశులు ఒకచోట, ఆకలి చావులు ఒకచోట " అంటూ బడుగు బలహీన వర్గాలకు బాసటగా ...భూస్వామ్య వాదాన్ని తిరస్కరించిన ప్రజావాది. వ్యక్తిత్వం, కవిత్వం వేర్వేరు కాని మనీషి కాళోజీ.

సాహిత్య ప్రవేశానికి ముందు కాళోజీ గారు గొప్ప కథకుడు కావాలనో, కవిని అనిపించు కోవాలనో అనుకోలేదు. కాళోజీ కవిత కాలం ప్రవహిస్తున్న వ్యథ." ఇవ్వాళ నేను కవిత్వం చెప్పేది ' నా గొడవ ' గా దానిలో ఏదన్న మంచి ఉన్నదంటే మంచిదే "నని తన గొడవను చెప్పారు. ఒక్క మాటలో చెప్పాలంటే కాళోజీది కమ్యూనికేటివ్ కవిత్వం. తన గొడవ తెలంగాణ గొడవ. మౌలికంగా మనిషి గొడవ. ఆయన రక్త మాంసాలున్న అసలు సిసలు మనిషి. సత్య అన్వేషి. నిత్య పథికుడు. అందుకే రక్త మాంసాలున్న మనుషులందరికి అర్ధమయ్యే భాష ఆయనది. నేడు గడ్డివాములో సూది వెతుకుతున్నట్టు మన భాష ఇంగ్లీషు వ్యామోహంలో పడి విద్యార్థుల జీవితాలు ఆగమాగం అవుతున్నాయి. ఓ పక్క మన భాషకు, యాసకు పత్రికా, మీడియా, సినిమా రంగంలో పెరుగుతున్న క్రేజీ అంతా ఇంతా కాదు.

**"అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి.**
**అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి.**
**అన్యాయాన్ని ఎదిరించినోడే నాకు ఆరాధ్యుడు"**అని తేల్చి చెప్పిన కలేజా కాళోజీది.

ఏ కవయినా తన సమకాలీకుల మీద ఏ మాత్రం జంకు లేకుండా, నిర్భయంగా తన అభిప్రాయాన్ని వెలువరించటం అంత తేలికయిన పని కాదు. వ్యక్తుల మధ్య సంబంధాలు మరీ పలుచగా ఉంటున్న వర్తమాన స్థితిలో ఇది మరీ అసాధ్యం. ఈ విషయంలో కాళోజీ స్పష్టంగా ఉన్నారు. మొహమాటం కానీ ఇతరులు ఏమనుకుంటారోనన్న భయమే కానీ ఆయన జీవితంలో, కవిత్వంలో ఎక్కడా మనకు కనిపించదు. కుండ బద్దలు కొట్టినట్లు భావ వ్యక్తీకరణ చేయటం ఆయన నైజం. ఈ విషయంలో ఆయన సన్నిహిత మిత్రుల్ని కూడా వదిలి పెట్టలేదు.

జీవితం, కవిత్వం, రాజకీయాలు అన్నింటిలోనూ కాళోజీ ప్రజాస్వామికవాది. ఇంకా చెప్పాలంటే తీవ్ర ప్రజాస్వామికవాది. కేవలం పౌర హక్కులకే కాదు, సమాజంలో ఏ దారుణం జరిగినా ఖండించటంలో ఆయన ముందుండేవారు.

**దోపిడీ చేసే ప్రాంతేతరులను/దూరందాకా తన్ని తరముతం**
**ప్రాంతం వారే దోపిడీ చేస్తే / ప్రాణంతోనే పాతర వేస్తం** అని అగ్రవర్ణ దళారుల అణచివేత, దోపిడీలను, వాళ్ళతో మిలాఖతయిన ప్రాంతం వారిని నిర్ద్వంధ్వంగా ఖండించిన కాళోజీ ఆధునిక యుగంలో ప్రతీ ఒక్కరికి ఆదర్శప్రాయుడు.

కలం సిరాను " నభూతో న భవిష్యతి " గా వర్ణించిన విశిష్ట కవి కాళోజీ నారాయణ రావు గారికి శత సహస్ర వందన చందనములతో తెలంగాణ సాహిత్య కళాపీఠం " కాళన్న యాదిలో..." కవితా సంకలనంను 226 మంది కవులతో పుస్తకం తేవటమే కాకుండా వివిధ దేశాలలో...వివిధ రంగాలలో... కృషి చేస్తున్న 12 మంది ప్రముఖులైన తెలుగు వారిని గుర్తించి "ప్రజాకవి కాళోజీ జాతీయ పురస్కారాల "ను 2020 సంవత్సరానికి గాను ఎంపిక చేసి, 28 ఆగస్టు 2022 న సిద్దిపేట పట్టణంలో మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి వర్యులు శ్రీ తన్నీరు హరీశ్ రావు గారి చేతుల మీదుగా పురస్కారాలను ప్రదానం చేయడం జరిగింది.

కాళోజీ 2002లో భౌతికంగా ఈ నేలను వీడినా... ప్రతీ తెలంగాణ వాడి గుండెలో బతికే ఉంటాడని, ఉండాలని ఆకాంక్షిస్తూ... ప్రజా జీవితాన్ని ప్రభావితం చేసిన ఆయన సమగ్ర మూర్తిమత్వాన్ని, వ్యక్తిత్వాన్ని అకళింపు చేసుకొని రాబోయే తరాలకు ఆదర్శంగా తెలంగాణ సాహిత్య కళాపీఠం(సాహిత్య, కళా సాంస్కృతిక, సామాజిక, సేవా సంస్థ ) చరిత్రలో నిలిచే మరెన్నో కార్యక్రమాలతో ముందు వరుసలో ఉంటుందని తెలుపుతూ... నేడు ఆ మహానుభావుని జయంతి సందర్భంగా ఘనమైన నివాళి.



- దాసరి(జంగిటి) శాంతకుమారి
9652483644.

## కాళోజీ

తెలంగాణ ఆత్మగౌరవ కలం కాళోజీ
రాజకీయ సాంఘీక చైతన్యాల సమాహారం
ఓ ధిక్కార స్వరం, జన చేతన బలం
అన్యాయాన్ని "నా గొడవ"కు సంతృప్తి యని

ఓ నిరంతర చైతన్య శీలి !!
పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిదని
రంగారావు రమాబాయమ్మ పుత్ర కలం
రుక్మిణిబాయి ని మనువాడి మడికొండలో నుండి
న్యాయవాదివై అన్యాయాన్ని ఎదిరించిన నీ సూటిదనం !!

ఓ పద్మ విభూషణా !!
రజాకార్ల ఘాతుకాలను ప్రతిఘటించిన రఘువీరా
"మన కొంపలార్పిన మన స్త్రీ లను చెరిచిన
కసి ఆరిపోకుండా బుసకొట్టుచుండాలే "యని
సాగి పోవుటే బ్రతుకు ఆగిపోవుట చావన్న ప్రజాకవి!!

ఓ ప్రజావాధి !!
నైజామ్ వ్యతిరేక పోరాటం లో.......
"దొరల దెబ్బలు తినుచు గురువు సాపెను వినుచు
బాంచెనయ్యా యనుచు ప్రణమిల్లు ప్రాణాలు" యని
ఆశా నిరాశ ల వ్యత్యాసం తెలిపిన ప్రజల మనిషి !!

ఓ ఉద్యమకర్తా !!
తెలంగాణ ఉద్యమంలో నీరచనే బల్లెంలై
నీ పుట్టుక, "తెలంగాణ భాషా దినోత్సవం"
నీ నడక హెల్త్ యూనివర్సిటీ
కాలంబు రాగానే కాటేసి తీరాలే యని
కసి తీరా రాసావు కాళన్న !!
నీకు జోహార్, జోహార్...



-యెనుగందుల శంకర్
9440747614

## తెలంగాణ భాషా దినోత్సవం

ఆనాడు నిజాం నిరంకుశ పాలనలో తెలుగు భాషకు ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక తెలంగాణా భాషకు యాసకు జరిగిన అన్యాయాన్ని చూసి బాధపడి తెలుగు భాషకు ,తెలంగాణా భాషకు తగిన గౌరవం లభించాలని, మన భాషలో యాసలో రచనలు చేయాలని ఆశించి బాధపడ్డ తెలంగాణా ముద్దు బిడ్డ.

ఒక ధిక్కారస్వరం, నిరహంకారం, ఆవేశం, ఆలోచన ,సమాజంలో జరిగే అన్యాయాలను రచనల ద్వారా ఎండగట్టే మహనీయుడు. అందరి గొడవలను తన బాధగా భావించి 'నా గొడవ'లో వినిపించి సమాజంలో మార్పు రావాలని ఆశించిన గొంతెత్తిన కలం యోధుడు శ్రీ కాళోజీ నారాయణ రావు గారు.

1914 సంవత్సరం సెప్టెంబర్ 9 వ తేదీన బీజాపూర్లోని రట్టిహళ్ళి అనే గ్రామంలో రంగారావు, రమాబాయి దంపతులకు జన్మించాడు. కాళోజీ చిన్నతనంలోనే తెలంగాణాకు వలస వచ్చారు తల్లిదండ్రులు. కాళోజీకి మరాఠీ, కన్నడ, తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో నిష్ణాతుడు.

నిజాం ప్రభుత్వంలో ఉర్దూ రాజభాషగా ఉన్నందున ఉర్దూమాధ్యమంలో చదివినప్పటికి తెలుగు భాష పట్ల తెలంగాణ భాష పట్ల చాలా అభిమానం కలవాడు.

నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. ఆంధ్ర మహాసభలు, ఆర్యసమాజం, తెలంగాణా రైతాంగ పోరాటం, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాలలో చైతన్య వంతంగా తన వంతు పాత్రను పోషించాడు. తెలంగాణాలో ఉవ్వెత్తున ఎగిసిపడ్డ ఒక తెలంగాణా ఆత్మాభిమాన కెరటం.

తెలంగాణా భాషకు యాసకు జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక తన గొంతును విప్పి కలం ఝళిపించిన భాషాభిమాని.

ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపక సభ్యుల్లో, తెలంగాణా రచయితల సంఘ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకడు.

అనేక రచనలు చేసిన మహాకవి. కాకతీయ విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్ ను, కేంద్ర ప్రభుత్వం వారు పద్మ విభూషణ్ పురస్కారంతో గౌరవించారు. అనేక అవార్డులు, రివార్డులు పొందిన మహాకవి.

**"అన్య భాషలు నేర్చి**
**ఆంధ్రంబు రాదంచు**
**సకిలించు ఆంధ్రుడా**
**చావవెందుకురా"** అని నినదించి తెలుగు భాష గొప్పతనాన్ని, మాతృ భాష ప్రాముఖ్యతను చాటి చెప్పాడు.

ఇంత గొప్ప సేవ చేసిన మహనీయుని జన్మ దినాన్ని పురస్కరించుకొని తెలంగాణా రాష్ట్రం ఆవిర్భవించినాక తెలంగాణ భాషా దినోత్సవాన్ని, ఆయన పేరు మీదుగా తెలంగాణా సాహిత్య విశిష్ట వ్యక్తికి కాళోజీ పురస్కారమిచ్చి తన్ను తాను గౌరవించుకుంటుంది. కాళోజీ ధిక్కార స్వరం అందరికి ఆదర్శనీయం.



-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383



పుస్తక సమీక్ష

# రాఖీ 'మనో దర్పణం'







**"చెప్పదానికి లెక్క దొరకని**
**తెలపడానికి భాషచాలని**
**పలువిధ ప్రయోజనకారి**
**ఎన్నెన్నో అవసరాలకు**
**తానంటూ ముందుకురికే**
**బహుముఖ ప్రజ్ఞాశాలి"**
**ఎవరనుకుంటున్నారు? అదేనం డీ.. కాంటా, అర్థం కాలేదా? 'పిన్నీసు' పిన్నీసులంటే ఆషా మాషా?"** కథా రథపు చక్రపు సీలలవుతాయి" "రామాయణంలో జటాయు వులా. భారతంలో పాచికలా" ఎన్నెన్నో సంఘటనలకు "ఆయువు పట్టు ఔతా యి". గుండీ తెగిపోయి జారిపోతున్న లాగూకి రక్షణగా, చిరుగును మరుగుపరుస్తూ, బిచ్చగత్తె మానం కాస్తూ, తెగిన స్లిప్పర్ నాడాకు చేయూతనందిస్తూ, కాల్లో గుచ్చుకున్న ముల్లును లాఘవంగా వెలుపలకు లాగివేస్తూ, చెవిలోగులను దూరం చేసి గుబిలిని తీసివేస్తూ, పళ్ళ సందుల్లో యిరుక్కున్న పీచును పెరికివేస్తూ.. యిలా పిన్నీసు 'చిన్నపనిముట్టై ఎంతో పనిచేసిపెట్టు, అల్ప సాధనమే ఎన్నో సాధించిపెట్టు" అంటున్నాడు డా॥గొల్లపెల్లి రాంకిషన్. కలం పేరు రాఖీ.

"కవిత్వానికి కాదు ఏదీ అనర్హం" అన్నాడు మహాకవి శ్రీశ్రీ. 'పిన్నీసు' రాఖీకి కవితావస్తువయింది.

రాఖీ స్వతహాగా గీత రచయిత. యిప్పటివరకు 2500లకు పైగా గీతా లను రాసిన ఈకవి తాజాగా 108 వచన కవితలతో 'మనో దర్పణం' పేరిట ఓ కవితా సంపుటిని వెలువరిం చాడు. మనస్సులో మెదిలిన భావా లకు అక్షర దర్పణం పట్టాడు అన్న మాట.

తెలంగాణలో 'చల్నేదే బాల్కిషన్' అనే నానుడి వినే వుంటారు. అంటే సమాజంలో సంభవిస్తున్న కొన్ని పరిణా మాలను చూస్తూ ఊర్కోవడం తప్ప మనం ఏమీ చేయలేం అని అర్థం. ఉదాహరణకు "అరె పాగల్ గున్నవ బై.. గీ పాతబస్తీల రూల్స్ గీల్స్ జాంతానై.. హ్ మల్ల గదంతే, అరే మస్తుసోచాయించకు దమాక్ ఖరా బైద్ది.. చల్నేదో బాల్కిషన్" అంటున్నాడు రాఖీ. హైదరాబాద్ పాతబస్తీలోని పరిస్థితులకు దర్పణం పట్టిన తీరు యిది.

'ఫోర్త్ ఎస్టేట్' అంటే పత్రికా రంగం సమాజంలోని అన్యాయాలను ఎదిరిస్తు పాలకులను (బాధ్యులను) ప్రశ్నించడమే దాని కర్తవ్యం. విరామ మెరుగని వ్యవస్థ యిది.

**'సెలవు లేని నిత్య కృషీవలుడవు**
**అలుపెరుగని సైనికుడవు" అంటు పాత్రికేయుడ్ని శ్లాఘిస్తాడు రాఖీ.**

**పుట్టిన ప్రతి జీవి గిట్టకమానదు. కానీ చావుని ఆహ్వానించడమెందుకు? బలవర్మణాలు ఎందుకు?**

**"సాగేదాకా సాగడమేగా జీవిత మంటే రేపు చావు తప్పదని ఇవ్వాళే ఆత్మహత్యలెందుకు"** అంటు పిరికి గుండెలకు ఆత్మస్థైర్యం నూరిపోస్తు న్నాడు.

**"ఎదురుగా వున్నప్పుడు ముఖం తిప్పుకుంటావ్**
**కవ్వించడానికి ఎదురొచ్చి మరీ తప్పుకుంటావ్**
**గుండెనుతట్టి చూడటం.. మనసుని పట్టి చూడటం**
**బుంగమూతి పెట్టి మరీ**
**ఆకట్టుకోవడం.. నీకంటే తెలిసిన వారెవరున్నారని..** యిలా విరహం చిప్పిరిల్లిస్తు చాలా ప్రేమ కవితలే రాశాడు.

'మనసంటే' కూడిక, తీసివేత, హెచ్చవేత, భాగహారం, పవరాఫ్, ఈజిక్వోల్టు అంటు సరదా "వింత లెక్కలు" వినిపిస్తాడు.

ఈ కవి స్నేహశీలి. "తనమ తమే.. స్నేహితం" అంటున్న రాఖీ 'స్నేహ స్ఫూర్తి'ని అభినందించకుండా వుండలేం. 'స్నేహం'పై రాసిన కవితలు చదవండి. నాతో ఏకీభవిస్తారు.

**"కడుపు చించుక వస్తేనే కవిత్వం**
**గుండెల్లోకి దూసుకపోయేదే**
**కవిత్వం!"** యిదీ కవిత్వం పట్ల రాఖీ అవగాహన.

అవగాహన సరే. రాయడం ఎలా?

**"చదువరులకు ఏదో వెలితి తెలుస్తూ వుంటుంది**
**అది నాకూ తెలుస్తూ వుంటుంది**
**ఏదో అసంపూర్తి గోచరిస్తునే వుంటుంది"**
కొత్తగా రాస్తున్న వాళ్ళందరిదీ యిదీ సమస్య.
**"నా అన్వేషణ వస్తువు కోసమే..**
**వస్తువు కొత్త దారులు వెతుక్కుం టోంది**
**అయినా కూడా.. నాకు వస్తువు దొరకడంలేదు**
**కాస్త మీరైనా.. చెప్పరూ..దాని ఆచూకి!"**

నిజమే! వస్తువును అందిపుచ్చుకోవడమే కష్టం. అందిన వస్తువును లోచూపుతో పొరలు, పొరలుగా విప్పి కవిత్వీకరించడం మరీ కష్టం. వస్తువు దొరికింది సరే!

"ఏం లాభం? శైలి నన్ను గేలి చేస్తూనే వుంటుంది
ఏం చేస్తాం, నెరవేరని సంకల్పం నాదంటూ ఇంకా ఏర్పడని శిల్పం"

'శిల్పం అంటే మనం ఇవ్వాల్సిన దాన్ని ఎత్తి ప్రజల అంగిట్లో పంపేం దుకు పనికొచ్చే పద్ధతి' అంటారు మహాకవి శివారెడ్డి. అనుకరిస్తే, అనుసరిస్తే అబ్బే విద్యకాదిది. ఎవరి శైలి వారిదే కావాలి. వచన కవిత్వానికి ఏ నిబంధనలు లేవు. మరి వచనాన్ని కవిత్వం చేయడం చాలా కష్టం. ఊహ తోడవ్వందే కవిత్వం పుట్టదు. అసలు తాను రాసింది కవిత్వమా.. కాదా అని పరులు చెప్పవలసిన అవసరం లేదు. ఏ కవితకు ఆ కవే మొదటి పాఠకుడు మరియు విమర్శకుడు కూడా. వస్తువు స్ఫురించగానే కాగితం మీద పనిచేసినంత మాత్రాన కవిత్వమైపోదు. ఏదో పత్రికలో అచ్చయినంత మాత్రాన ఉత్తమమూ కాదు. వస్తువుని మనస్సులో బాగా మాగనివ్వాలి. మధించాలి. ఒకటికి రెండు సార్లు రాసిందానిని సరి చూసుకోవాలి. రెక్కలు బలంగా వుంటే పిట్ట దానంతట అదే ఎగురు తుంది. ఊహకందనంత ఎత్తుల్లో విహరిస్తుంది. పండు మాగటానికి కావాల్సింది సమయం యివ్వాలిగా! కొత్తగా రాస్తున్న వాళ్ళు ఈ విషయాలను గమనించాలి. నిరంతర అధ్యయనం, అభ్యాసం తప్పని సరి. రాఖీ ఏమంటున్నాడో చూడండి..

**"ఓ కవీ రవీ పవీ!**
**కవిత్వం ఎందుకోసమో**
**ఎవరి కోసమో రాయం**
**కవిత్వం వల్ల కల్ల**
**ఉద్ధరించడం, ఉద్ధరింపబడ్డం**
**రాయడం కవి ధర్మం**
**నచ్చితే పాఠక స్పందనం**
**నచ్చకుంటే సాష్టాంగ వందనం!"** కవి సృజనకారుడు. మేథో మధనంతో నూతన సృష్టికి కారకుడు. స్వానుభవం లేదూ పరాయి అనుభవాన్ని తనలోకి ఒంపుకొని కవిత్వమై వ్యక్తమవుతాడు. చదివిన పాఠకుడికి తానేదో క్రొత్తగా పొందిన అనుభవానికి లోనవ్వాలి. కమ్మటి అనుభూతితో పరవశుడవ్వాలి. కవిత్వ పరమార్థం అదేగా! ఏదో ఒక ప్రయోజనం లేని సృజన వ్యర్థం.

రాఖీ కవిత్వం చదవండి. నచ్చితే స్పందించండి. నచ్చకుంటేకవి సాష్టాంగ వందనం అందుకోండి.

**ప్రతులకు:** డా॥ గొల్లపల్లి రాంకిషన్
ఇ.నెం. 3-217/11,
రోడ్ నెం. 14-నార్త్
ప్రశాంతి హిల్స్
మీర్‌పేట్,
హైదరాబాద్-500 097
సెల్: 94949 94896



- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

## అంతిమ క్షణం

గాలి నెమ్మదిగా వీస్తోంది
శ్వాస గిరికీలు కొడుతుంది
శరీరం మొరాయిస్తోంది

పాదాలకు ఎవరో రాళ్లు కట్టారు
బురదలో ఇరుక్కుపోయాయి
చుట్టూ పరచుకున్న వసంతం

మసకబారడం చూస్తున్నాను
నవ్వెప్పుడో ఆరిపోయింది
మాట మరచిపోయాను
భాష మర్చిపోయాను

ఆనందవిషాదాలను మరచి
నిశ్చల సరస్సుగా మారాను

మిణుకుమిణుకుమంటున్న
నీ జ్ఞాపకపు దివ్వె తప్ప
జగత్తులో ఏది లేదు!?



-మౌనశ్రీ మల్లిక్
8919338546

## పరవశం

పరవశించే ఆకాశం
నేలంతా పచ్చగా పరుచుకున్న సుగంధత్వం
అదొక ప్రాణప్రదమైన చలనగీతం
దేహం హృదయం కలగలిసిన రసాత్మక సమ్మేళనం.

వన్నె వన్నెల వెన్నెల ప్రపంచం
అదొక ఆకుపచ్చని పర్యావరణ చక్రం
సాగర తీరమే వయ్యారమైన ప్రాంతం
సుందర నందనమైన దృశ్యా దృశ్య చిత్రం
సముద్రపు అలల మీదనే అలుపెరుగని ప్రయాణం
నడుస్తున్న పడవ మీదనే ఇల్లూ ఇర్వాటం రవాణా.

నాలుగువందల ఏళ్ళ నాడు వాస్కోడిగామా
కనిపెట్టిన సుగంధ ద్రవ్యాల పుట్టిల్లు కేరళ
బానిసత్వానికి వ్యతిరేకంగా ఎరుపెక్కిన నేల
పోర్చుగీసుల చొరబాటుకు ఇదే సాక్షిభూతం.

భౌగోళిక కేరళ ఆకారమే నెలవంక రూపం
పక్కనే తళుక్కుమనే అరేబియా సింగారం
ప్రపంచానికి మిరియాల కారం చూపిన భూమి ఇది

కేరళలో ఎటు చూసినా ప్రాకృతికత
కేరింతలు కొట్టాలనిపించే సౌందర్యత.

పచ్చని లోతైన పర్వత సానువుల్లోంచి
కదిలి పోతున్న నీలి నీలి ఆకాశాలు
కళ్ళ ముందే కనిపించే మేఘావృత గగనం
కాళ్ళ కింద పరుచుకున్న ఆకుపచ్చని అలంకారం.

గాలికి సుగంధ ద్రవ్యాల చెట్లు ఊగుతుంటే
ఊపిరిలోకి ఇంకుతున్న మూలికల ఆవిర్లు
మున్నార్ మన్నులోనే ఆయుర్వేద కనికట్టు
ఇడుక్కి జిల్లా అంతటా ఎర్రచందనపు మెరుపు.

మరో చెట్టుకు ఏపుగా అల్లుకున్న మిరియాల తీగ
చిన్ని చిన్ని ముత్యాల వలె కాపు గాసిన కారం
పండి పండని పచ్చి మిరియాల కాయలు
నోట్లె వేసికుంటే సురుక్కుమనే సురుకు.

తాడిచెట్ల కన్న పొడవైనవి పోక వక్కల చెట్లు
జెండాల వలె నిటారుగా ఆకుల రెపరెపలు
పచ్చని అరణ్యంలో అక్కడక్కడా వక్కల వనం
అడుగడుగునా పెద్ద పెద్ద పనస వృక్షాలు
చెట్టు మోయలేనంత విరగ కాసిన పండ్లు.

లవంగాలు యాలకులు సాజీర చెట్లనైతే
చూస్తుండగానే అల్లుకున్న సుగంధ పుప్పొడి
ఆకుల రుచి చూసినా అదే రసాత్మకత
మనం తులం తులం కొనే దినుసులన్నీ

కేరళంలో రాశులకు రాశులు కుప్పలు తెప్పలు
తేయాకు చెట్లన్నీ ఒక్కటై నిలిచినట్లు
తెంచిన ఆకులతో మిగిలిపోయినట్లుగా
కురుస రూపం
చూస్తుంటే చాలు మనసంతా మసిలే చాయ
చాపత్తల సాగు రైతులది కాదట
టాటా లిప్టన్ రిప్పన్ కంపెనీలవే టీ ఎస్టేట్స్
చల్లని గమ్మతైన శీతల వాతావరణం
కొండ కోనల్లో కార్పోరేట్ టీ వ్యవసాయం.

కాఫీ తోటలు నయనాలకు కమనీయం
చెట్టును పట్టుకుంటేనే నాలికకు సై దొరికినట్టు
గింజలు గిర్నీ చేస్తున్న ధ్వని
వ్యాపించే వాసనతో నోరంతా కాఫీమయం.

ఇండ్ల చుట్టూరా పెంచినట్టు చెట్లు కావు
మొక్కల మధ్యనే మొలిచినట్టు అక్కడి గృహాలు
ఊరూ వాడా అల్లుకున్న హరితహారం
మలయాళంలోనే ఒక సౌందర్య దృక్పథం
గృహ నిర్మాణంలోనూ ఏటవాలు రూఫ్ల అందం

ఇండ్ల పక్కనే వ్యవసాయ క్షేత్రాలు
రబ్బరు తోట, కొబ్బరి తోటా, అరటి సాగులు
చేనూ చెలకల మధ్యనే ఆవాసాలు
రహదారుల పొడుగూతా పరుచుకున్న పల్లెలు
కొండల నడుమ కోక్ చెట్ల వరసలు
కోక్ పండ్ల నుంచే బ్లాక్ చాక్లెట్స్ రూపం
ఎరవికుల అరణ్యం గృహ ఔషధాల నిలయం
మున్నార్ మూడు నదుల, జలపాతాల ప్రవాహం
కన్నన్ దేవన్ కొండలు, చిన్నార్ అభయారణ్యం
నేలంతా పరిచి ఉంచిన పచ్చని తివాచీ
కొండల్లోంచి దునుకుతున్న పాల నురగల జలం.

ఆళపుజనే అలప్పీ, అలవి గాని హాపీ ప్లేస్
బ్యాక్ వాటర్ లో బొంబాటైన బోటు ప్రయాణం
పున్నమడ సరస్సు ఒక ఊగే ఉయ్యాల సొగసు
నీటి అలల మీద తేలిపోతున్న యానం
అందులోనే ఆహారం, అందులోనే శయన మందిరం
సముద్రంలో హృదయాలు పారేసుకున్న సంబురం
గాలిలో మనసు తేలిపోతున్న సందర్భం
విస్తరించిన సరస్సులో ముచ్చటైన విహారం
వైనాడు అంటే పసిడి పంటల నేల
బాణాసుర ఆనకట్ట మట్టి కొండల నిర్మాణం
అదొక టేకు వనాల సుందర దృశ్య పీఠ భూమి
పడమటి కనుమల్లోంచి సూర్యున్ని చూస్తే
కళ్ళకు అందం మనస్సుకు ఆహ్లాదం
అరేబియా సముద్ర అలల గాలి తగిలితే
హృదయం నిండారుగ ఉప్పొంగే తరంగం
కేరళ యాత్ర జీవ వైవిధ్యాల సుగంధం.



-అన్నవరం దేవేందర్
9440763479

## విశ్వ నగరం

చెరువు నాలలన్ని చెరిపి కబ్జా చేసి!
కట్టడాలు అన్ని కట్టి వేయ!!
చూసి చూడనట్లు చూసిరి పైవారు!
విశ్వ నగర మంటు విర్ర వీగ!!

చిన్నవాన కురిసి చిత్తడగును రోడ్లు!
చిన్న గాలి వీచి చెట్లని పడు !!
చిన్న ఉరుము ఉరిమి చిత్తవు తీగలు !
విశ్వ నగర మంటు విర్ర వీగ !!

రోడ్డు వేయునొకడు రోడ్డు త్రవ్వునొకడు!
చెత్త తీయు చుండ చెత్త వేయు !!
చెట్లు నాటునొకడు చెట్లు నర్కునొకడు!
విశ్వ నగర మంటు విర్ర వీగ!!

అడుగు యడుగు కొక్క యర్థ మీటరు గుంట !
బైకు పైన రైడు బాధ గుండు !!
ట్రాఫికంత జాము యాఫీసు పోలేము!
విశ్వ నగర మంటు విర్ర వీగ !!
చిన్న వాన కురిసి చిత్తడిగా రోడ్లు !

వరద గాను పారి వాగులయెను !!
కొంపలన్ని మునిగి కొల్లేరు లాయెరా !
విశ్వ నగర మంటు విర్ర వీగ !!



-కనకయ్య మల్లముల
9440554042

